అత్యాధునిక రైతు సమాచార కేంద్రం

● గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ అప్పిరెడ్డి

గుంటూరు, మేజర్‌న్యూస్ : ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చి యార్డులో అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి రైతు సమాచార కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు యార్డు ఛైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రైతు సమాచార కేంద్రంలో రైతులకు అత్యాధునిక వ్యవసాయ పద్దతులపై ప్రత్యేక వ్యవస్థ ద్వారా అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రైతులు ప్రపంచ వ్యాప్తంగా తమ ఉత్పత్తులకు సంబంధించి విపణిలో ఉన్న ధర వరలు సహా ఇతరత్రా అన్ని రకాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తెలుసుకొనే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 2500 కోట్ల వ్యాపారమే లక్ష్యం

గుంటూరు మిర్చియార్డులో ఈ ఏడాది 2,500 కోట్ల రూపాయల వ్యాపారం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అప్పిరెడ్డి తెలిపారు. దూర ప్రాంతాల నుంచి యార్డుకు వచ్చే రైతులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. మిర్చి సీజన్ కొనసాగే మే నెల వరకు భోజన వసతి ఉంటుందన్నారు. అలాగే రైతుల కోసం అనేక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మార్కెట్‌కు అనుగుణంగానే ధరలు

మిర్చి యార్డులో వ్యాపారులు రైతులు తీసుకువచ్చిన ఉత్పత్తికి తక్కువ ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారనే అపప్రదను తొలగించే ఏర్పాట్లు చేస్తామని అప్పిరెడ్డి వివరించారు. ధరలు వివరాలను ఆన్‌లైన్ పద్ధతిలో డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి రైతులు మోసపోకుండా చూస్తామన్నారు.

నిర్మాణ దశలో ఉన్న రైతు సమాచార కేంద్రం

వేసవి వ్యాధులు వస్తున్నాయ్!

- అప్రమత్తంకాని యంత్రాంగం
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- కలుషితమవుతున్న తాగునీరు
- గిరిజన ప్రాంతాలపై కొరవడుతున్న శ్రద్ధ..
- ఏటా పెరుగుతున్న మరణాలు
- సీజనల్ వ్యాధులతో జరభద్రం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో వేసవి తాకిడి అప్పుడే మొదలైంది. ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్ నుంచి ప్రారంభం కావాల్సిన వేసవి సీజన్ నెల రోజులు ముందుగానే ప్రతాపం చూపిస్తోంది. ఇప్పటి కే పలు జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలకు చేరడంతో ప్రజలు అల్లాడుతున్నారు. దీనికి తోడు కరెంటు కోత ప్రజలను పట్టి పీడిస్తోంది. ప్రచండభానుడి ప్రతాపంతో పలు జిల్లాలో భూగర్భజలాలు అడుగంటాయి. సరఫరా అవుతోన్న తాగు నీరు చాలావరకు కలుషితమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అతిసార, డయేరియా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వడదెబ్బతో వృద్ధులు పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది. ఇక గిరిజన ప్రాంతాల ప్రజలైతే ఎండలతో హడలిపోతున్నారు. అక్కడ తాగునీరు పూర్తిగా కలుషితమవడంతో ఎక్కువగా అతిసార కేసులు నమోదవుతున్నాయి. వైద్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ప్రజారోగ్యం దైవాదీనంగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. ఏటా పలు వ్యాధులు ప్రజల ప్రాణాలను కబళిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గతంలో భోలక్‌పూర్ కలుషిత జలాల బారిన పడి సుమారు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రులకు రాకుండా అడవుల్లో దొరికే మూలికలతోనే వైద్యం చేసుకోవడంతో వ్యాధులు పెరుగుతున్నాయి. వేసవిలో పిల్లల సంరక్షణ కొంత కష్టంగానే ఉంటోంది. ఈ సమయంలోనే అనారోగ్యం పొంచి ఉంటోంది. సీజనల్‌గా వచ్చే వ్యాధులు కొన్నైతే, విపరీతమైన ఎండలు, రద్దీ ప్రదేశాల్లో అపరిశుభ్రత, సురక్షితమైన మంచినీరు అందకపోవడం మూలంగా మరిన్ని వ్యాధులు సోకుతున్నాయి. వీటిలో కొన్నింటి వల్ల చిన్నారుల ప్రాణానికే ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

వేసవిలో వీటితో జాగ్రత్త..

ప్రధానంగా వేసవి కాలంలో హీట్ హైపర్ పైరెక్సియా, మీజిల్స్(పొంగు), చికెన్‌ఫాక్స్ (ఆటలమ్మ), టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. వడదెబ్బతో ఎంతోమంది ప్రాణాలుగాల్లో కలుస్తున్నాయి. ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల నీరు, లవణాలు చెమట ద్వారా బయటకు వెళ్లిపోయి సొమ్మసిల్లి పడిపోతారు. వేసవి కాలంలో ప్రధానంగా అతిసార, పచ్చకామెర్లు వంటి వ్యాధులపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. కలుషితమైన నీటి కారణంగా కూడా వ్యాధులు దరిచేరతాయని చెపుతున్నారు. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటిన తరువాత ఎండలో తిరిగే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది.

ప్రాణాలు తీసే పచ్చకామెర్లు..

పచ్చకామెర్ల వ్యాధి అతి సూక్ష్మమైన క్రిముల వల్ల వస్తుంది. పదిహేను నుంచి ఇరవై రోజుల్లో వ్యాధి ప్రారంభ లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం, ఆకలి లేకపోవడం, కొవ్వు పదార్థాలను తినలేకుండా ఉంటుంది.

అతిసార(నీళ్ల విరేచనాలు)..

కలుషితమైన నీరు, ఆహారం వల్ల నీళ్ల విరేచనాలు కలుగుతాయి. ఈ వ్యాధితో రోగి నీరసించిపోతాడు. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతుంది.

వణికించే వడదెబ్బ..

తీవ్రమైన ఎండ వేడికి ఎక్కువమందిలో వడదెబ్బ తగులుతుంది. 104 డిగ్రీల కన్నా ఎక్కువగా జ్వరం, ఒళ్లంతా వేడిగా, పొడిగా, ఎర్రగా కందిపోతుంది. నాడి వేగంగా కొట్టు కోవడం, బీపీ పడిపోవడం ఈ వ్యాధి లక్షణాలుగా చెపుతారు. వడదెబ్బ తగిలిన వారికి చల్లని నీళ్లు స్ప్రేచేస్తూ గాలి వచ్చేట్లు ప్యాన్ పెట్టాలి.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

★ఇంట్లో వాతావరణం చల్లగా ఉండేలా చూసుకోవాలి
★ఎండలో వెళ్లడానికి 20 నిముషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్ వాడి చర్మాన్ని కాపాడుకోవాలి
★ఆల్కహాల్, కోలా డ్రింక్స్ హానికరం. చల్లని నీరు తాగాలి. కొబ్బరి నీరు ఎంతో మంచిది
★రోజుకు 4లీటర్ల నీటిని తప్పనిసరిగా తాగాలి
★లైట్ రంగు, కాటన్ బట్టలు ధరించాలి
★ ఎండలో వెళ్లేటపుడు గొడుకు తలకు హెల్మెట్ ఉంటే ఎండ నుంచి ఉపశమనం లభిస్తుంది
★ఆహారంలో తగినంత ఉప్పు తీసుకోవాలి. డాక్టర్ సలహా మేరకు తక్కువ ఉప్పువాడాలి
★ ఎండలో బయటకు వెళ్లకుండా చల్లబడిన తరువాత పనులు చూసుకుంటే మంచిది
★చిన్నపిల్లలను తీసుకువెళ్లేటపుడు కంటికి అద్దాలు, తలపై టోపీ, కండువా కప్పుకోవాలి

తిరుమల సమాచారం



శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసే భక్తుల మోస్తరుగా ఉంది. స్వామి వారి దర్శనం కోసం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు భక్తులు స్వామి దర్శనం కోసం వేచి ఉన్నారు. మహాలఘు దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. మంగళవారం సుమారు 45 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 9వ తేది సాయంత్రం 7 గంటలకు అందిన సమాచారం మేరకు..

ఉచిత గదులు	– 08 అందుబాటులో ఉన్నాయి
50 రూపాయల గదులు	– 15 అందుబాటులో ఉన్నాయి
100 రూపాయల గదులు	– ఖాళీ లేవు
500 రూపాయల గదులు	– 08 అందుబాటులో ఉన్నాయి

ఆర్జిత సేవా టికెట్లు

ఊంజల్‌సేవా టికెట్లు	: బ్యాంక్ కోటాలో ఖాళీలేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	: 08 అందుబాటులో ఉన్నాయి
వసంతోత్సవం	:13 అందుబాటులో వున్నాయి
సహస్ర దీపాలంకరణ సేవ	: 53 అందుబాటులో ఉన్నాయి
వారాంతపుసేవ (బుధవారం)	: సహస్రకళషాభిషేకం

– మేజర్‌న్యూస్, తిరుమల.

మే నెలలో టీటీడీ అంతర్జాతీయ సదస్సు!

తిరుమల, మేజర్‌న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించతల పెట్టిన అంతర్జాతీయ సదస్సు రద్దు చేసిన విషయం విదితమే. అయితే ఈ సదస్సును మే నెలలో తిరుపతిలోని శ్వేతా భవన్‌లో నిర్వహించనున్నట్టు సమాచారం. శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశంను రద్దు చేసినట్టు తెలిసింది. టిటిడిపై పలువురు రాజకీయ పార్టీ నాయకులు ప్రత్యక్ష యుద్ధానికి తలపడనున్నారని ఇంటెలిజెన్స్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నేపథ్యంలో సదస్సు రద్దు నిర్ణయం తీసుకున్నారు. తిరుపతిలో నిర్వహించనున్న సదస్సును రద్దు చేయాలని స్థానిక శాసనసభ్యుడు, పీఆర్పీ అధినేత చిరంజీవి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ నివేదిక, చిరంజీవి విజ్ఞప్తి మేరకు సెమినార్‌ను రద్దు చేశారు. శాసనసభ సమావేశాల అనంతరం మేలో ఈ సెమినార్ నిర్వహించుకోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం సూచనప్రాయంగా ఉన్నతాధికారులకు తెలిపినట్టు సమాచారం.

గోడౌన్‌లో కోటి రూపాయల పొగాకు దగ్ధం

మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

మర్రిపాడు, మేజర్‌న్యూస్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం డిసిపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పొగాకు గొడౌన్లు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు కోటి రూపాయల మేర ఆస్తినష్టం వాటిల్లింది. శాఖాపరమైన ఉన్నతస్థాయి అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టం అంచనాలను తయారు చేసి ఉన్నతస్తాయి అధికారులకు నివేదికలు అందచేసి త్వరితగతిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన వేలం నిర్వాహణాధికారి

అగ్నికి ఆహుతైన పొగాకు గొడౌన్‌లను డిసిపల్లి వేలంకేంద్రం నిర్వాహణాధికారి షేక్ కాలేషా పరిశీలించారు. కాలిపోయిన పొగాకును చూసి జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



గోదావరి డెల్టాకు పోల‘వరమే’

పూర్తయితే లక్షల ఎకరాలు సస్యశ్యామలం ● జాతీయ హోదాకు అడ్డుపుల్ల

కాకినాడ, మేజర్‌న్యూస్ ప్రతినిధి : గోదావరి డెల్టాలో 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన బ్యారేజ్ ఆ లక్ష్యాలను అందించటంలో నీటి లభ్యత సరిపోక విఫలమవుతోంది. రెండేళ్ళుగా ఇదే పరిస్థితి. ఈ ఏడాది రెండవ పంటకు మూడవ వంతు కూడా పంట నీరు అందించేందకు అవకాశం లేక నీటి పారుదల శాఖ అధికారులు ఎల్‌జివోను ఆశ్రయించారు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి ఉప నదులపై ఎత్తి పోతల పథకాలు వస్తే భవిష్యత్‌లో గోదావరి డెల్టాకు రెండవ పంటకు కాదుగదా మొదటి పంటకే నీరు ఇచ్చే పరిస్థితి ఉండదు. దీనికి పరిష్కారంగా ఎన్నో ఆశలతో ప్రారంభించిన పోలవరం ప్రాజెక్ట్ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్రాజెక్ట్‌లో కీలకమైన డ్యామ్, స్పిల్‌వే పనులకు టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయడంతో ప్రాజెక్ట్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందనేది పెద్ద సందేహంగా ఉంది. అగాధం అంచు నుంచి డెల్టాను కాపాడుకునేందుకు పోలవరం సత్వర నిర్మాణం మినహా మరో మార్గం లేదు. వరదల కాలంలో ఏటా 2వేల టిఎంసి.ల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంది. ఆ నీటిలో కొంతైనా నిల్వ చేసుకునే రిజర్వాయర్ పథకం ఒక పోలవరం మాత్రమే. ఇదీ ప్రకృతి ప్రసాదించిన వరం. ఆరు దశాబ్దాల క్రితమే ఇక్కడ ప్రాజెక్ట్‌ను నిర్మించాల్సి ఉంది. అప్పట్లో రూ.130కోట్లు ఖర్చు అవుతుందని భావించిన ఈ ప్రాజెక్ట్ ఫైలును స్వర్గీయ వై.ఎస్.రాజశేఖరరెడ్డి దుమ్ము దులిపారు. 194టిఎంసి.ల నిల్వ, 303 టిఎంసి.ల వినియోగ సామర్థ్యంతో రూ.10,151కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. పోలవరం ప్రాజెక్ట్ ఎగువన 7ఎత్తిపోతల పథకాలు నిర్మాణ మవుతున్నాయి. ఎల్లంపల్లి, దేవాదుల, కుంతాలపల్లి, దుమ్ముగూడెం, రాజీవ్ సాగర్ కాంట్రాక్ట్‌లకు గత ఏడాది ఆగస్టు తర్వాత చెల్లింపులు లేవు. కానీ తెలంగాణలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలకు కాంట్రాక్టర్లకు గత నవంబర్, డిసెంబర్ నెలల్లో బిల్లులు కూడా చెల్లించారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించి ఆ వ్యయంలో 80శాతం గ్రాంటుగా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది.ఈ తరుణంలో రాజకీయం పోలవరంలో ప్రవేశించిం ది. దీంతోపాటు ప్రాణహిత–చేవెళ్ళ కు జాతీయ హోదా కల్పించాలంటూ మెలిక పెట్టారు. దీంతో కేంద్రం పోలవరంను పెండింగ్‌లో ఉంచింది.

పోలవరం కోసం ఉద్యమిస్తాం : జ్యోతుల నెహ్రూ

దీర్ఘకాలిక నీటి ప్రయోజనాలను అందించే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయాలని పీఆర్పీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. దీని కోసం అవసరమైతే తమ పార్టీ అధినేత చిరంజీవి కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తారన్నారు. పోలవరం నిర్మాణం ఆగినా, ఆలస్యమైనా ప్రజలు క్షమించరన్నారు. గోదావరి డెల్టా 150ఏళ్ల క్రితం ఏవిధంగా ఉండేదో అటువంటి పరిస్థితులు పునరావృతమయ్యే ప్రమాదముందన్నారు. ఆహారోత్పత్తుల్లో దేశం అగ్రభాగాన నిలవాలంటే పోలవరంతోనే ముడిపడిందన్నారు.

తెలంగాణ కోసం మరో విద్యార్థి బలిదానం

- ఓయూలో ఉరివేసుకున్న సాయికుమార్
- మృతదేహంతో గాంధీలో పడిగాపులు
- శవయాత్రకు యత్నం, పరిస్థితి ఉద్రిక్తం

సాయికుమార్ మృతదేహం వద్ద విద్యార్థులు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ‘నాలుగు కోట్ల నా తెలంగాణా ప్రజలకు ఇదే నా ఆఖరి వీడ్కోలు..నా ప్రాణాలను తెలంగాణకు అంకితమిస్తున్నా... దగాకోరు రాజకీయ నాయకులను నమ్మకుండా తెలివైన యువతే సారధిగా తెలంగాణాను సాధించండి...నా శవయాత్రను అసెంబ్లీ వరకు జరపండి అన్నలారా... ఉంటాను..అందరికీ సెలవు’ అంటూ ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థి ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. నల్గొండ జిల్లా కోదాడ మండలం కాకునగన్ గ్రామానికి చెందిన లింగయ్య కుమారుడు మీగడ సాయికుమార్ బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం అందరు విద్యార్థులు తరగతులకు వెళ్ళిన సమయంలో 108 టెక్నాలజీ హాస్టల్ గదిలో ఉరివేసుకున్నాడు. రెండు క్లాసుల తర్వాత తిరిగి వచ్చిన విద్యార్థులు కొన ప్రాణాలతో ఉన్న సాయికుమార్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించగా మరణించాడు. విషయం తెలిసిన వెంటనే ఓయూ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల దృష్టి మరల్చి సాయికుమార్ మృతదేహాన్ని మొదట ఉస్మానియా యూనివర్శిటీ, ఆ తర్వాత అసెంబ్లీ వరకు తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప లాఠీఛార్జితో పాటు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వివాదానికి దిగిన తెలంగాణా జేఏసీ కన్వీనర్ కోదండరామ్ కాలుకు గాయమైంది. విజయ్ అనే మరో విద్యార్థికి గుండెపోటు వచ్చింది. తోపులాటలో కిందపడిన విజయ్‌ను అత్యవసర వార్డుకు తరలించి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు – పోలీసులు అక్కడే మోహరించారు. అయితే మెడికో లీగల్ కేసు కావడం వల్ల పోస్టుమార్టం జరపకుండా శవాన్ని అప్పగించే ప్రసక్తే లేదని పోలీసులు తేల్చిచెప్పారు. విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న వెంటనే కోదండరామ్‌తో పాటు పద్మాదేవేందర్, ఈటెల రాజేందర్‌తో పాటు పలువురు టీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకున్నారు. మాజీ మావోయిస్టు సాంబశివుడు గాంధీ ఆసుపత్రికి వచ్చారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై 13న పార్లమెంట్ ముట్టడి

ధర్నాలో పాల్గొన్న నారాయణ

విజయనగరం, మేజర్‌న్యూస్ : మంత్రి బొత్స సత్యనారాయణ కాంగ్రెస్‌కు రాజకీయ బాంబు వంటి వారని, ఆయన చేత పార్టీ విధా నాన్ని అధిష్టానం వల్లిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ ఆరోపించారు. పెరిగిన ధరలపై విజయనగరం జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ఆందోళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ పుట్టలో పాము అయినా కాంగ్రెస్ బుట్టలో చేరాలన్నదే అధిష్టానం ఆలోచనని, అందులో భాగంగానే మంత్రి బొత్స చేత అడుగులు వేయిస్తోందని చెప్పారు. బొత్స కర్చీఫ్ వేసుకొని అవకాశం కోసం చూస్తున్నారని, ప్రాంతీయ అభివృద్ధి పై నిజంగా చిత్తశుద్ధి ఉంటే పదవులకు, పార్టీకి రాజీనామా చేసి బయటకు రా వాలని పిలుపునిచ్చారు. తెలంగాణతోపాటు ఇతర ప్రాంతాల వెనుకబాటులు శ్రీ కృష్ణ కమిటీ ఎదుట స్పష్టం చేస్తామన్నారు.

నెల్లూరు మేయర్

భానుశ్రీ ఇంటిపై ఏసీబీ దాడులు

- లెక్కకు మించి ఆస్తులు
- వివిధ ప్రాంతాల్లో 18కి పైగా ప్లాట్లు

విలేకరులకు వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ అధికారి

నెల్లూరు, మేజర్‌న్యూస్ : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నగర మేయర్ నందిమండలం భానుశ్రీ ఇంటిపై ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారు జామున దాడులు నిర్వహించారు. మేయర్ భర్త ఎన్.సుబ్బరాజు ట్రాన్స్‌కో డీఈగా పనిచేస్తున్నారు. ఈ దాడుల్లో నెల్లూరు, బెంగళూరు,హైదరాబాద్‌లలో18 ఇళ్లస్థలాలతో పాటు విలువైన వజ్రాభరణాలు,నగదు లభ్యమైంది. సుబ్బరాజు ఇంటితో పాటు ఏకకాలంలో ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లపై కూడా దాడులు జరిగాయి. భానుశ్రీకి అత్యంత సన్నిహితంగా మెలిగే పలువురితో పాటు హైదరాబాద్‌లో ఉంటున్న అత్త వాసుదేవమ్మ ఇంటిపై కూడా దాడులు జరిగాయి. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటి వరకూ బయటపడ్డ ఆస్తులు సుమారు 94 లక్షలుగా ఉన్నప్పటికీ మార్కెట్ విలువతో పోలిస్తే పది కోట్లకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. 18 ప్లాట్లు, 367 గ్రాముల బంగారు ఆభరణాలు, డైమండ్ ఆభరణాలు, 6.32 లక్షల ఎల్ఐసి బాండ్లు, 31 లక్షల రూపాయల స్థిరాస్తులు, స్కార్పియో, మారుతి స్విఫ్ట్ కార్లు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. ఇదే సమయంలో భానుశ్రీ సన్నిహితులు, బంధువులు అయిన రమణరాజు, ఆనందరావు, చామర్తి బాలయ్య, డాక్టర్ సులోచన, ఆమె అత్తగారైన వాసుదేవమ్మల ఇళ్లపై దాడులు నిర్వహించారు. అనంతరం మరిన్ని వివరాల కోసం భానుశ్రీ భర్త, డిఇ సుబ్బరాజును హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. నెల్లూరు మేయర్ నందిమండలం భానుశ్రీపై అవినీతి ఆరోపణలు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున వచ్చాయి. ప్రతి పనికి ముడుపులు స్వీకరించడమే కాకుండా, చాలా పనులు కేవలం రికార్డుల్లో మాత్రమే చూపించి, బిల్లులు మంజూరు చేసి నిధులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన భానుశ్రీపై సొంత వర్గంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓర్వలేకే దాడులు : భానుశ్రీ

తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చి మేయర్ స్థాయికి ఎదగడం చూసి ఓర్వలేని కొందరు నేతలు తనపై బురదచల్లుతున్నారని మేయర్ భానుశ్రీ ఆరోపించారు. తన భర్తకు నెలకు రూ. 60 వేలు జీతం, అత్త వాసుదేవమ్మకు నెలకు 10 వేల రూపాయల పింఛను, ఇళ్ల నుంచి అద్దెరూపంలో నెలకు 15 వేల రూపాయల వరకూ ఆదాయం లభిస్తోందని ఆమె వివరించారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన ఆస్తులకు లెక్కలు ఉన్నాయని ఆమె అన్నారు.

బాబుపై ‘బంగి’ తిరుగుబాటు

బంగి అనంతయ్య

కర్నూలు, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యలపై వినూత్న రీతిలో నిరసన తెలియజేసే కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపైనే తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. రాజ్యసభ సీటు కోసం రెండు రోజుల క్రితం చంద్రబాబును కలిసిన ఆయన,తనకు సీటు వచ్చే అవకాశాలు సన్నగిల్లడంతో పార్టీ తన పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని వాపోయారు. తన చావుకు ఏకంగా పార్టీ అధినేతే కారణమంటూ మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించలేదని ఈ నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. తన ప్రాణానికి చంద్రబాబు నాయుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కెఇ కృష్ణమూర్తి, ఆయన సోదరుడు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ ప్రభాకర్, మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు కారణమవుతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు రాజ్యసభ సీటు తనకు ఇవ్వడని, స్థానిక నేతలు కూడా ఇవ్వనివ్వరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వరంగల్‌లో

తాగునీటికి కటకట

- నగరంలో ప్రజల పాట్లు
- కాసులు కురిపిస్తున్న నీళ్ల వ్యాపారం
- బిందెకు రూ. 2 ఖర్చు

వరంగల్, మేజర్‌న్యూస్ ప్రతినిధి : వేసవి సీజన్ ప్రారంభంతోనే వరంగల్ జిల్లాలో తాగు నీటి ఎద్దడి తీవ్రమైంది. నగరంలో తాగునీటి జలాశయాలుగా ఉన్న భద్రకాళి, హన్మకొండలోని వడ్డేపల్లి చెరువుల్లో నీరు అడుగంటిపోయింది. దీంతో నగరంలోని పలు కాలనీలకు మూడు రోజులకోమారు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో నగర ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో సుమారు 9 లక్షల జనాభా ఉంటుంది. దీనికి తగ్గట్లుగా నగర పాలక సంస్థ చర్యలు తీసుకోకపోవడంతో తాగు నీటి సమస్య ఏటా వస్తూనే ఉంది. జిల్లాలోని జనగామ, మహబూబాబాద్ డివిజన్‌లో మంచినీటి ఎద్దడి చెప్పనలవి కాదు. మహబూబాబాద్ పట్టణంలో తాగునీటి కష్టాలు మహిళలను ఇబ్బందులకు గురిచేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి ఎద్దడి జనవరి నుంచే ప్రారంభంకావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందించే మున్నేరువాగు పూర్తిగా అడుగంటడంతో తాగునీటి కటకట మొదలైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడు తీవ్ర వర్షాభావం కారణంగా మున్నేరువాగు నవంబర్‌నాటికే ఎండి పోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఈదులపూసల్లి చెరువు నీటిని వదలడంతో జనవరి చివరివారం నాటికి వాగు నుంచి తాగునీటిని సరఫరా చేయగలిగారు. కాగా ఫిబ్రవరి మొదటి వారానికి ఆనీరు కూడా అడుగంటడంతో చేసేదేమి లేక గ్రామ పంచాయితీ పాలకవర్గం చేతులు ఎత్తేసింది. ప్రత్యామ్నాయంగా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మార్గాల అన్వేషణలో నిమగ్నమైంది. అందులో భాగంగానే ఎస్ఆర్ఎస్పీ జలాలను కాల్వల ద్వారా మున్నేరువాగులోకి



విడుదల చేయడం..కొత్తగా బోర్లు వేయడం..తాగు నీటి బావులలోతు మరింత పెంచడం.. లాంటి చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించారు. అనుమతుల కోసం వేచిచూస్తున్నారు. నీటి సమస్య ఎదురైనప్పుడే ప్రత్యామ్నాయ చర్యలు తప్ప... శాశ్వత పరిష్కారం కోసం పాలకులు చేపట్టిన చర్యలు శూన్యమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కష్టాలను గతంలో ఎన్నడూ జనవరిలోపే ఎదుర్కొన్న పరిస్థితి మానుకోట పట్టణ ప్రజలకు ఎదురుకాలేదు. సుమారు 70వేల ప్రజలు నివసిస్తున్న పట్టణంలో నీటి సౌలభ్యం లేకపోవడంతో కొనుగోలు చేసే పరిస్థితి దాపురించింది.

తాగు నీరు బిందెకు 2 రూపాయాలు

మహబూబాబాద్ శివారు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అందుబాటులో ఉన్న బావులు, బోర్లద్వారా ట్యాంకర్లు ఉన్న వారు వివిధ కాలనీల్లో నీటి అమ్మకాలు సాగిస్తున్నారు. బిందె నీటికిరూ. 2లకు విక్రయిస్తున్నారు. సుమారు యాభై కి పైగా ట్యాంకర్లు నీటి వ్యాపారంలోకి దిగాయి. మరో నెలరోజులు గడిస్తే మరింత ప్రియం కానుంది.

ఇళ్లు ఖాళీ చేయిస్తున్న యజమానులు..

పట్టణాల్లో నీటి ఎద్దడి రోజురోజుకు విషమిస్తున్న తరుణంలో ఇళ్లను ఖాళీ చే యాలని అద్దెదారులను యజమానులు ఇబ్బందిపెడుతున్నారు. కొన్ని ఇళ్లలో నీటి సౌలభ్యం పూర్తిగా లేని పరిస్థితిల్లో వారు కొనుగోలు చేస్తున్న నీటి విలువను తాము చెల్లించే కిరాయినుంచి మినహాయిస్తుండడంతో.. విధిలేని పరిస్థితుల్లో బలవంతంగానైనా.. ఇళ్లను ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నారు.

ముఖ్యాంశాలు

■ వరంగల్‌లో తాగునీటి జలాశయాలుగా ఉన్న భద్రకాళి, వడ్డెపల్లి చెరువుల్లో నీరు అడుగంటిపోయింది.
■ నగరంలోని పలు కాలనీలకు మూడు రోజులకోమారు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.
■ ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా మున్నేరు వాగు నవంబర్‌నాటికే ఎండిపోయింది.
■ ఎస్సారెస్పీ జలాలను కాల్వల ద్వారా మున్నేరువాగులోకి విడుదల చేయడం, కొత్తగా బోర్లు వేయడం, తాగు నీటి బావులలోతు మరింత పెంచడం లాంటి చర్యలు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.
■ మహబూబాబాద్ శివారు ప్రాంతాల్లో నీరు సౌలభ్యం లేనికారణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. బిందె నీరు రూ. 2లకు విక్రయిస్తున్నారు.
■ పట్టణంలో నీటి ఎద్దడి రోజురోజుకు విషమిస్తున్న తరుణంలో అద్దెకు ఇస్తున్న ఇళ్ల యజమానులు ఇళ్లను ఖాళీ చేయాలని బలవంత పెడుతున్నారు. ఇప్పటికే సుమారు 500 ఇళ్లు ఖాళీ చేయించారు.

నారాయణమూర్తిపై చర్య తీసుకోవాలి

వినతిపత్రాన్ని చూపుతున్న సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ

విశాఖపట్నం, మేజర్‌న్యూస్: కళాకారులకు ప్రాంతీయ భేదాలు లేవని చెప్పే మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) తెలంగాణ పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్న విప్లవనటుడు ఆర్. నారాయణమూర్తిపై చర్యలు తీసుకోవాలని సమైక్యాంధ్ర విద్యార్థి జెఏసి డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జెఏసి కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, నారాయణమూర్తిపై ‘మా’ చైర్మన్ మురళీ మోహన్‌కు ఫిర్యాదుచేయనున్నట్లు చెప్పారు.అన్ని ప్రాం తాల ప్రజలు తమకు సమానమేనని చెప్పే సినీ కళాకారులు ఈ విషయంపై ఏం చెబుతారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో జూనియర్ ఎన్టీఆర్, మోహన్‌బాబు కుమారుల సిని మాలను, షూటింగ్‌లను అడ్డుకున్న సమయంలో కూడా తాము సంయమనం పాటించామన్నారు. తెలంగాణ హీరో నితిన్ సినిమా విశాఖలో విడుదల అయితే పూలు పంచి శుభాకాంక్షలు తెలియచేశామని చెప్పారు. ఈ పరిస్థితులలో సమైక్యవాదులను రెచ్చగొట్టేలా నారాయణమూర్తి విశాఖ వచ్చి ప్రత్యేక తెలంగాణవాదాన్ని వినిపించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.